క్లుప్తంగా

విద్యా కానుక కిట్ల పరిశీలన



మెటీరియల్స్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఏలేశ్వరం: జగనన్న విద్యాకానుక మెటీరియల్స్‌ను శనివారం ఉన్నతాధికారులు తనిఖీ చేశారు. అమరావతి ఎస్‌పీడీ కార్యాలయం రాష్ట్ర పరిశీలకుడు గని, సమగ్ర శిశు శిక్షణ జిల్లా సీఎంఓ చామంతి నాగేశ్వరరావు విద్యార్థులకు అందించే మెటీరియల్స్‌ను పరిశీలించారు. విద్యార్థులను నుంచి కొలతలను తనిఖీ చేశారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన మెటీరియల్స్ అందిస్తామన్నారు. ఎంఈఓ అబ్బాయి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు రామగానామృతం

కోటనందూరు: పాతకొట్టాం రామాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం శ్రీరామ గానామృతం-హనుమద్వైభవం' కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. భారతదేశ వ్యాప్తంగా ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించిన కంభంపాటి సోదరులు(కృష్ణ ఆదిత్య-కృష్ణ శశాంక్) శ్రీరాముని దివ్య మహిమను వివరించే గానం, హనుమంతుని వైభవాన్ని సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకూ ప్రవచనం చేస్తారన్నారు. కంభంపాటి సోదరులు ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా, మహారాష్ట్ర, కర్ణాటక, ఢిల్లీలో శ్రీరామనామ సంకీర్తన, ప్రవచన ప్రదర్శనలు ఇచ్చారు. వారి ప్రవచనలకు మండల వ్యాప్తంగా ప్రజలు తరలివచ్చి తిలకించాలని ఆలయ కమిటీ కోరింది.

నేడు హనుమాన్ శోభాయాత్ర

జగ్గంపేట: స్థానిక గోకవరం రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వద్ద నుంచి ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్నట్టు కేసరియా హిందూ వాహిని రాష్ట్ర అధ్యక్షుడు దాట్ల కృష్ణవర్మ తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న బైక్ ర్యాలీలో యువత పాల్గొనాలని పిలుపునిచ్చారు.

పౌష్టికాహార కిట్ల పంపిణీ



విద్యార్థులకు కిట్లు అందజేస్తున్న సత్తి శేషారెడ్డి దంపతులు

ప్రత్తిపాడు: పేద విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించేందుకు స్వచ్ఛంద సంస్థలు అందిస్తున్న సేవలు శ్లాఘనీయమని సత్తి శేషారెడ్డి, లావణ్య దంపతులు అన్నారు. ప్రత్తిపాడు బజారు వీధి రామాలయం ఆవరణలో శనివారం 'సదా మీ సేవలో (ఎస్‌ఎంఎస్)' స్వచ్ఛంద సంస్థ నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేసింది. ఈ కిట్లను శేషారెడ్డి దంపతుల చేతుల మీదుగా అందజేశారు. శ్రీషిర్డిసాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి, జి సత్యానందం, శిరసాల మణికంఠ జ్యోతి పాల్గొన్నారు.

కాంగ్రెస్ విజయోత్సవం

ప్రత్తిపాడు: కర్నాటకలో కాంగ్రెస్ పార్టీ విజయ దుందుభి మోగించడంతో ప్రత్తిపాడులో ఆ పార్టీ కార్యకర్తలు శనివారం సాయంత్రం విజయోత్సవాన్ని నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ కళా మందిర్ వద్ద కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమ్మిడి వెంకట్రావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కర్నాటకలో అత్యధికంగా 136 స్థానాలను గెలుచుకోవడంతో పార్టీ కార్యకర్తలు బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచారు. పీసీసీ సభ్యుడు ధరణాలకోట శ్రీను, పార్టీ ఎస్సీ సెల్, బీసీ సెల్ అధ్యక్షుడు మొయ్యేటి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక తరలింపు



ఏలేరుకాలువ వద్ద జేసీబీతో ట్రాక్టర్‌లో వేస్తున్న ఇసుక

ఏలేశ్వరం: తిరుమాలి గ్రామంలోని ఏలేరు కాలువలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఎటువంటి అనుమతులు లేకుండా ట్రాక్టర్లతో ఇసుకను తరలిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏలేరు కాలువలో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం నుంచి అనుమతులు లేవు. అయినా కాలువలో ఇసుకను తరలిస్తున్నారు. అక్రమార్కులు వేలాదిరూపాయలను వెనుకేసుకుంటున్నారు. గతంలో ఇసుక తరలింపును అధికారులు అడ్డుకున్నారు. ఇటీవల బహిరంగంగా పగలే ఇసుకను ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సెలవు రోజుల్లో ఎక్కువగా జరుగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారుల దృష్టికి వెళ్లినా చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

కీటకజనిత వ్యాధులపై అవగాహన

గోకవరం: కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రిలో శనివారం రాజమహేంద్రవరం మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసరాజు వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. అంటువ్యాధులు, సంక్రమణ కీటకాల ద్వారా వ్యాపించే వ్యాధులు, రక్త పరీక్షల గురించి అవగాహన కల్పించారు. ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ అశోక్‌వర్ధన్, ఎంఎల్‌హెచ్‌పీ, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. నెరవేరనున్న వేళ..

- రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధం
- స్థల పరిశీలనలో ప్రజాప్రతినిధులు, అధికారులు
- ఫలించిన ఎమ్మెల్యే 'పర్వత' కృషి



పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు రౌతులపూడిలో ప్రత్తిపాడు సీఐ కిశోర్‌బాబుతో కలసి స్థలం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పర్వత

రౌతులపూడి: ప్రజలకు రక్షణగా ఉండేది పోలీసులు. మండలంలో పోలీసుస్టేషన్ ఉంటే ప్రజలందరూ ధైర్యంగా ఉంటారు. రెండు దశాబ్దాల తర్వాత ఆ మండల ప్రజల కల సాకారమైంది. ఎమ్మెల్యే పర్వత పూర్ణ చంద్ర ప్రసాద్ కృషితో రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఇక్కడ స్థానికంగా పోలీస్ స్టేషన్‌లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మండలం ఏర్పడి 20ఏళ్లు..


ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల్లో 58వ మండలంగా రౌతులపూడి ఏర్పడింది. ఈ మండలం ఏర్పడి 20ఏళ్ల గడచినా స్థానికంగా పోలీస్ స్టేషన్ లేకపోవడంతో పక్క మండలాలైన కోటనందూరు, శంఖవరం మండలంలోని అన్నవరం, తుని మండలంలోని తుని రూరల్ పోలీస్ స్టేషన్లకు వెళ్లి ప్రజలు తమ సమస్యలు పరిష్కరించుకునేవారు. మండల గ్రామాల్లో కుటుంబ, సామాజిక, రాజకీయ, వర్గాల కారణంగా ఏ సమసయ వచ్చినా పక్క మండలాల పోలీస్‌స్టేషన్ల ద్వారా ఇప్పటి వరకూ రక్షణ సదుపాయాలు కల్పిస్తున్నారు. ఏ చిన్న గొడవ వచ్చినా 30 కిలోమీటర్లు ఉన్న కోటనందూరు, 30 కిలోమీటర్ల ఉన్న తుని, 25 కిలోమీటర్లు ఉన్న అన్నవరం పోలీసు స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేసుకోవాలి. దీంతో ఎంతో వ్యయ ప్రయాసలకు గురయ్యేవారు.

మూడు పోలీసు స్టేషన్ల పరిధిలో...

- ఉప ప్రణాళిక ప్రాంతానికి చెందిన రాఘవపట్నం, జల్దాం, ఎస్.పైడిపాల గ్రామాలతోపాటు, మల్లంపేట, ఉప్పంపాలెం, గుమ్మరేగుల, బలరామపురం, ఎ.మల్లవరం, బీబీ పట్నం లచ్చిరెడ్డిపాలెం, ములగపూడి, ఎం.కొత్తూరు. రాజవరం, గంగవరం, దిగువశివాడ తదితర 15 పంచాయతీల్లో గ్రామాల ప్రజలు కోటనందూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నారు.
- మండల కేంద్రమైన రౌతులపూడి, బంగారయ్యపేట, శృంగవరం, పి.చామవరం, మెరక చామవరం, పారుపాక, కోడూరు, ఎస్.అగ్రహారం, డీజే పురం, గిడజాం పది గ్రామ పంచాయతీల ప్రజలు అన్నవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్నారు.
- ఎస్ఎస్ పట్నం గ్రామ పంచాయతీకి చెందిన ప్రజలు తుని రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్నారు.

ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ కృషి

మండలంలో పోలీస్ స్టేషన్ లేక ఎన్నో సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజలు ఇబ్బందులు గుర్తించిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ ఈ సమస్యను హోం మంత్రి, డీజీపీ, జిల్లా ఎస్పీ దష్టికి పలుమార్లు తీసుకెళ్లారు. ఈ మేరకు వారు పోలీసుస్టేషన్ ఏర్పాటుకు అధికారికంగా ఉత్తర్వులు వచ్చేలా చర్యలు చేపట్టారు. ఈ నెల ఏడో తేదీన ప్రత్తిపాడు సీఐ కె.కిశోర్‌బాబు, అన్నవరం అదనపు ఎస్ఐ అజయ్ బాబు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలసి రౌతులపూడిలో పర్యటించి స్థలం సేకరణ చేశారు. అయితే సరైన స్థలం కోసం లభించలేదు. కానీ మార్కెట్ వద్ద ఉన్న పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసే అవకాశం ఉందని స్థానికంగా ప్రచారం జరుగుతోంది. వీలైనంత త్వరలో ఈ నెలలోనే పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్టు అధికారికంగా వెల్లడించారు.



రౌతులపూడి ప్రజలు ఫిర్యాదు చేసుకునే కోటనందూరు పోలీస్‌స్టేషన్

ఎమ్మెల్యే పర్వతకు కృతజ్ఞతలు

ఎన్నో ఏళ్ల కల నెరవేర్చిన ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్‌కు ప్రజలందరూ కృతజ్ఞతలు తెలిపారు. ఎప్పటికీ రుణపడి ఉంటామని ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రుణపడి ఉంటాం



మండల కేంద్రమైన రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం వల్ల స్థానికంగా సమస్యలు పరిష్కరించుకోవచ్చు. పక్క మండలానికి పడిగెత్తాల్సిన అవసరం లేదు. వ్యయ ప్రయాసలు ఉండవు. ఎమ్మెల్యే పర్వతకు తామంతా రుణపడి ఉంటాం.

– రాపర్తి రామకృష్ణ, సర్పంచ్, గుమ్మరేగుల

ఎంతో ఆనందం



మండల కేంద్రమైన రౌతులపూడిలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషం. ఇప్పటి వరకూ పక్క మండలాలు వెళ్లి ఆర్థికం గాను, శారీరకంగా తీవ్ర ఇబ్బందులు పడ్డ ప్రజలకు ఇక నుంచి ఆ కష్టాలు నుంచి గట్టెక్కుతాం. స్థానికంగా సకాలం సమస్యలు నెరవేర్చుకోవడానికి ఎంతోవీలుంటుంది.

– రాయి ప్రసాద్, ఎస్.పైడిపాల

ఘనంగా సత్యదేవుని నిత్యకల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

అన్నవరం: సత్యదేవుని నిత్యకల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని వార్షిక దివ్యకల్యాణ మహోత్సవాల సందర్భంగా గత నెల 30వ తేదీ నుంచి ఈ నెల ఆరో తేదీ వరకూ స్వామివారి నిత్య కల్యాణం నిర్వహించ లేదు. మళ్లీ ఏడో తేదీ నుంచి నిత్య కల్యాణం నిర్వహిస్తున్నారు. గత వారం రోజులుగా రత్నగిరితోపాటు పలు ప్రాంతాల్లో వివాహాలు జోరుగా జరుగుతున్న విషయం తెలిసిందే. దీంతో స్వామి, అమ్మవార్ల కల్యాణంలో నవదంపతులు కూడా పాల్గొంటున్నారు. దీంతో కల్యాణ మండపాలు కళకళలాడుతోంది. ఉదయం తొమ్మిది గంటలకు సత్యదేవుడు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను ఊరేగింపుగా నిత్య కల్యాణ మండపానికి తీసుకువచ్చారు. అక్కడ కల్యాణ వేదిక మీద ప్రతిష్ఠించి పూజలు చేశారు. అనంతరం ఉప ప్రధాన అర్చక చిట్టెం గోపీ, కల్యాణబ్రహ్మ చామర్తి కన్నబాబు, పురోహితుడు పాలంకి పట్టాభి స్వామివారి కల్యాణం ఘనంగా నిర్వహించారు. 40 జంటలు స్వామి వారి నిత్యకల్యాణంలో పాల్గొన్నారు. స్వామివారి కల్యాణాన్ని యూట్యూబ్‌లో ప్రత్యక్ష ప్రసారం చేశారు.

లోక్ అదాలత్‌లో 307 కేసుల పరిష్కారం

తుని: స్థానిక కోర్టు ఆవరణలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 307 కేసులను పరిష్కరించినట్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.బాలకోటేశ్వరరావు శనివారం తెలిపారు. లోక్ అదాలత్‌కు వివిధ కేసులకు సంబంధించి 327 కేసులు రాగా ఇరువైపుల కక్షిదారులను ఒప్పించి 307 కేసులు పరిష్కరించామన్నారు. వీటి ద్వారా రూ.44,65,015 ఆదాయం సమకూరిందన్నారు. రాజీ మార్గమే రాజ మార్గమని జడ్జి కోటేశ్వరరావు కక్షిదారులకు సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రగడ చక్రధరరావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.



తునిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న జడ్జి బాలకోటేశ్వరరావు

ప్రత్తిపాడులో 65 కేసులు

ప్రత్తిపాడు: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఇన్‌చార్జి జడ్జి, రాజమహేంద్రవరం 7వ కోర్టు జడ్జి పి.బాబు 65 కేసులను పరిష్కరించారు. జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ సివిల్ మెజిస్ట్రేట్ కోర్టు, స్పెషల్ జ్యూడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు, జ్యూడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు పరిధిలో కేసులను పరిష్కరించారు. యూనియన్ బ్యాంక్, స్టేట్ బ్యాంకులకు సంబంధించిన 11 కేసుల నుంచి రూ. 4.12 లక్షలు రికవరీ చేయించారు. నాలుగు సివిల్ కేసుల ద్వారా రూ.3.30 లక్షలు, రెండు చెక్ బౌన్స్ కేసుల ద్వారా రూ.80 వేలు పరిష్కరించారు. 16 నేర ఒప్పంద కేసులను పరిష్కరించి, రూ.6,750 ప్రభుత్వానికి చలానా ద్వారా చెల్లింపులు చేయించారు. ఈలోక్ అధాలత్‌లో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి దాసరి సత్తిబాబు, బెంచ్ మెంబర్ ఏకేఎస్ మల్లేశ్వరరావు, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిట్టంశెట్టి పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

జగ్గంపేటలో 30 కేసులు

జగ్గంపేట: లోక్ అదాలత్‌లో 30 కేసులు పరిష్కారమయ్యాయని ఎస్సై సీహెచ్ విద్యాసాగర్ శనివారం తెలిపారు. పెద్దాపురం లోక్ అదాలత్ ఇన్‌చార్జి జేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ డి.శ్రీదేవి ఆధ్వర్యంలో కేసులు పరిష్కరించారన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సహాయం, నిత్యావసరాలు అందిస్తున్న ఎంపీపీ శ్రీనివాసు తదితరులు

కోటనందూరు: అగ్ని బాధిత కుటుంబానికి మంత్రి దాడిశెట్టి రాజా ఆర్థిక సహాయం అందజేశారు. గత మంగళవారం స్థానిక సీబీఎం చర్చి ప్రాంతంలో నందిక జయరాజుకు చెందిన తాటాకిళ్లు షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. సర్పంచ్ గర్సింగు శివలక్ష్మి ఆధ్వర్యంలో సమస్యను ఎంపీపీ లగుడు శ్రీనివాసుకు వివరించారు. ఎంపీపీ సమస్యను మంత్రి దాడిశెట్టి రాజా దృష్టికి తీసుకెళ్లగా రూ.20 వేల ఆర్థిక అందించారు. శనివారం ఎంపీపీ లగుడు శ్రీనివాసు వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అగ్ని ప్రమాదానికి కారణాలు అడిగి తెలుసుకుని ప్రత్యామ్నాయంగా ఇంటి స్థలాన్ని ఇస్తామని భరోసా ఇచ్చారు. మంత్రి రాజా ఇచ్చిన నగదుతో పాటు వైస్ ఎంపీపీ కొరుప్రోలు రమణమ్మ ఆర్థిక సాయంతో సమకూర్చిన నిత్యావసరాలు నాయకుల చేతుల మీదుగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, తుని ఏఎంసీ వైస్ ఛైర్మన్ వెలగా వెంకటకృష్ణాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు గర్సింగు దొరబాబు, కొరుప్రోలు కృష్ణ, మల్లంపల్లి ప్రకాష్, ఉల్లూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీతకు సన్మానం

తుని: ఇటీవల రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న శ్రీకిరణ్ వైద్య విజ్ఞాన సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్‌ను స్థానిక వాకర్స్ ఇంటర్నేషనల్ ఎలెక్ట్ గవర్నర్ చదరం శివాజీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంకురాత్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ 1985 జరిగిన విమాన ప్రమాదంలో తన కుటుంబాన్ని కోల్పోయానన్నారు. 1989లో కుటుంబ సభ్యుల పేరుమీద సంకురాత్రి ఫౌండేషన్‌ను, తన భార్య మంజరి పేరున సంకురాత్రి మంజరి మ్యూజిక్ కాలేజీని స్థాపించానన్నారు. కుమార్తె శారద పేరు మీద 1992లో శారద విద్యాలయాన్ని స్థాపించి ప్రాథమిక విద్య నుంచి పదో తరగతి వరకూ ఉచిత విద్యను అందిస్తున్నానన్నారు. 1993లో కుమారుడు శ్రీకిరణ్ పేరు మీద శ్రీకిరణ్ వైద్య విజ్ఞాన సంస్థను స్థాపించానన్నారు. కిరణ్ ఆసుపత్రి ద్వారా ఇప్పటి వరకూ 3.25 లక్షల క్యాటరాక్ట్ ఆపరేషన్లు, 30 వేల మందికి కంటి వైద్యాన్ని అందించామన్నారు. ఈ కార్యక్రమంలో తుని క్లబ్ అధ్యక్షులు కుందెం సత్యన్నారాయణ, కార్యదర్శి బోడిశెట్టి బాబూరావు, కోశాధికారి జూరెడ్డి చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



తునిలో సంకురాత్రి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

సత్రం భూములపై విచారణ నిర్వహించాలి

గోకవరం: సుందరమ్మ సత్రం భూములపై విచారణ నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు డిమాండ్ చేశారు. శనివారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గత 50 యేళ్లుగా సుందరమ్మ సత్రం భూములను కొందరు వ్యక్తులు తమ ఆధీనంలో ఉంచుకుని ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారన్నారు. దీనిపై తమ సంఘం ఆధ్వర్యంలో అలుపెరగని పోరాటం చేస్తున్నా ఎండోమెంట్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు స్పందించి ఈ భూములపై, పాండవుల మెట్ట భూములపై విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సురేష్, శ్రీకాంత్, గోలి ముసలమయ్య, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.



రంపయర్రంపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న రైతు కూలీ సంఘం నాయకులు

25న అయర్లా రాష్ట్రమహాసభ

ప్రత్తిపాడు: అనకాపల్లిలో ఈనెల 25వ తేదీన జరుగనున్న అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం (అయర్లా) 5వ మహాసభను విజయవంతం చేయాలని అయర్లా జిల్లా కార్యదర్శి మానుకొండ లచ్చబాబు కోరారు. స్థానిక సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం జరిగిన అయర్లా కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కర్నాటక ఎన్నికలు బీజేపీకి గుణపాఠం చెప్పాయన్నారు. గ్రామీణ కార్మికులకు ఉపాధి కల్పించే ఉపాధి హామీ పథకాన్ని ఎత్తివేసేందుకు నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు. ఈ పథకంలోని లోపాలను సవరించి, విస్తృత పరచాలని మానుకొండ లచ్చబాబు కోరారు. ఆదివాసీ గిరిజన సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతంలో 1/70 చట్టాన్ని ఎటువంటి సడలింపులు లేకుండా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనకాపల్లిలో జరుగనున్న మహాసభ పోస్టర్‌ను మానుకొండ లచ్చబాబు, రేచుకట్ల సింహాచలం ఆవిష్కరించారు. కార్యక్రమంలో లిబరేషన్ అనుబంధ సంస్థల నాయకులు పేరూరి లక్ష్మి, ఇరటా వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ



ఏలేశ్వరంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయుడు మూర్తి

ఏలేశ్వరం: గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా శనివారం విద్యార్థులకు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో లైబ్రేరియన్ కవికొండల సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు శిష్టా మూర్తి స్కిల్స్‌పై, మండల మాస్టర్ ట్రైనర్ మజ్జి నాగేశ్వరరావు ప్రకృతి వ్యవసాయంపై, రిటైర్డ్ ఉపాధ్యాయుడు మామిడి రాము విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ విద్యార్థులకు వివిధ కళలు, చిత్రలేఖనం, కథలు రాయడం, చదవడం, స్పోకెన్ ఇంగ్లీషు, మ్యాథ్స్, యోగ తదితర అంశాలపై శిక్షణ ఇస్తున్నామన్నారు. విద్యార్థులకు విధిగా విజ్ఞాన శిబిరాలకు హాజరుకావాలన్నారు.

తాగునీటికి పాట్లు

- అప్పన్నపాలెంలో సుద్దనీరు
- అపరిశుభ్రంగా జీఎల్ఆర్ ట్యాంక్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు



ట్యాంక్ చుట్టూ పేరుకుపోయిన నాచు

ఏలేశ్వరం: ఎన్నో ఏళ్ల నుంచి ఏలేశ్వరం నగర పంచాయతీ పరిధిలోని అప్పన్నపాలెం ప్రజలకు సుద్ద నీటినే తాగుతున్నారు. ఏ ప్రాంతంలో బోర్లు వేసిన సుద్దనీరే రావడంతో తాగేందుకు మంచినీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ ప్రాంతవాసులకు తాగునీరు అందించేందుకు జీఎల్ఆర్‌ట్యాంక్‌ను నిర్మించారు. దీని నుంచి సుద్దనీరే రావడంతో ఈ నీటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారు. తాగునీటి కోసం సమీప ఏలేరు కాలువలోని చలమలపై ఆధారపడుతున్నారు. నివాస ప్రాంతాలకు దూరంగా ఉన్న ఏలేరు కాలువకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. మరో ప్రాంతంలోని ప్రజలకు స్థానిక సచివాలయం వద్ద ఓవర్‌హెడ్ ట్యాంక్ ద్వారా తాగునీరు అందిస్తుండగా గత మూడు రోజులుగా ట్యాంక్ పని చేయకపోవడంతో నానా పాట్లు పడుతున్నారు.

అధ్వానంగా ట్యాంక్

తాగునీటిని అందించే జీఎల్ఆర్ ట్యాంక్ అధ్వానంగా మారింది. ట్యాంక్ నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడంతో దాని చుట్టు నాచు పేరుకుపోయింది. దీంతో పాటు నీరందించే పైపులు దెబ్బతిన్నాయి. అధికారులు ట్యాంక్ నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

తొండంగి: నిబంధనలకు విరుద్ధంగా ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. బెండపూడి జాతీయ రహదారిపై పాసింజర్ వాహనాలపై వెళ్లాల్సిన ప్రయాణికులు గూడ్స్ వాహనాలపై వెళ్తున్నప్పటికీ అధికారులు చూసీచూడనట్టు వదిలేస్తున్నారు. హైవేలపై పోలీసులు, రవాణా శాఖ అధికారులు గస్తీ నిర్వహించి గూడ్స్ వాహనాలపై ప్రయాణించేవారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



బెండపూడి జాతీయరహదారిపై గూడ్స్ వాహనంపై వెళుతున్న ప్రయాణికులు

ఘనంగా ప్రాకారసేవ



ఆలయ ప్రాంగణంలో తిరుచ్చి వాహనంపై ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

అన్నవరం: రత్నగిరి వాసుడు సత్యదేవుని ప్రాకార సేవ శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పది గంటలకు సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లను తిరుచ్చి వాహనంపై ఆశీనులు చేసి తూర్పు రాజగోపురం వద్ద ఉన్న ఆలయ ప్రాంగణంలోకి ఊరేగింపుగా తీసుకువచ్చారు. అక్కడ ప్రత్యేక పూజలు చేసిననంతరం వేదపండితుల మంత్రోచ్చాటనల మధ్య పెద్ద సంఖ్యలో భక్తులు వెంట రాగా ఆలయ ప్రాకారంలో మూడు సార్లు ఊరేగించారు. తర్వాత స్వామి, అమ్మవార్లకు పూజలు చేసి తిరిగి ఆలయానికి చేర్చారు. వేదపండితులు చిట్టి శివ ఘనపాఠీ, రమేష్ ఘనపాఠీ, ముష్టి పురుషోత్తం, అర్చకుడు సుధీర్ పాల్గొన్నారు.

తంటికొండ వెంకన్న ఆలయానికి భక్తుల తాకిడి

గోకవరం: తంటికొండ గ్రామంలో ప్రసిద్ధి చెందిన వెంకటగిరి కొండపై వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తుల తాకిడి ఎక్కువగా ఉంది. విద్యార్థులకు సెలవు దినాలు, రెండో శనివారం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకునేందుకు పోటెత్తారు. తెల్లవారుజాము నుంచి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామి వారికి మేల్కొలుపు సేవ, సుప్రభాత సేవ నిర్వహించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సుమారు 1500 మంది భక్తులు దర్శించుకున్నారని, 314 మంది తలనీలాలు సమర్పించారని ఈఓ ఆర్‌వీ చందన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం



శంఖవరంలో పైపులైన్ బాగుచేస్తున్న పంచాయతీ కార్మికులు

శంఖవరం: స్థానిక మధ్యవీధిలో కొంత కాలంగా ఉన్న తాగునీటి సమస్య తీరింది. అధికారులు పైపులైన్ బాగుజేసి పరిష్కరించారు. పంచాయతీ పైపులైన్ ధ్వంసం కావడంతో తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్య సర్పంచ్ బందిలి గనియమ్మ, కార్యదర్శి సీహెచ్ రాంబాబు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి నూతనం పైపును ఏర్పాటు చేసి ప్రజలకు తాగునీరు అందించారు.

అందరికీ రిజర్వేషన్లు కల్పించాలి



రాజుపాలెంలో ర్యాలీగా వెళుతున్న యువత

కిర్లంపూడి: అందరికీ సమానంగా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ జాతీయ దళిత ఐక్య సమైఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు దొమ్మేటి సుధాకర్ అధ్యక్షతన వీరవరం నుంచి చలో కాకినాడ కార్యక్రమం నిర్వహించారు. బైక్‌లు, కార్లపై ర్యాలీగా రాజుపాలెం, కిర్లంపూడి, గెద్దానాపల్లి, భూపాలపట్నం, యస్.తిమ్మాపురం, తామరాడ, గోనేడ గ్రామాల నుంచి జగ్గంపేట మండలం రామవరం మీదుగా కాకినాడకు బయలుదేరారు. ఈ సందర్భంగా రాజాసతీష్ మాట్లాడుతూ కుల, మత బేధం లేకుండా అందరికీ రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దళితులకు 3ఎకరాలు పొలం, మహిళలకు అన్ని రంగాల్లో 50 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరారు. తొలుత వీరవరంలో అంబేడ్కర్ విగ్రహం, దళిత మీడియా సెంటర్, వరహాలయ్య విగ్రహంతో పాటు డయాస్ హాల్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అంబటి బుజ్జమ్మ, గొల్లపల్లి చక్రధర్, మడికి బాబ్జి, బిరిసి రాజేష్, మద్ద సురేష్, ఎమ్ముల సత్తిబాబు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కొత్తపల్లి: మూలపేటలో అనారోగ్యంతో బాధపడుతున్న వారిని శనివారం వైఎస్సార్ నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. కొండా అన్నవరానికి రూ.10వేలు, ముత్తు శివకు, మేరుగు నల్లయ్యకు రూ.5వేలు చొప్పున అందజేశారు. పరామర్శించిన వారిలో మండల కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు, మత్స్యకార నాయకుడు కంబాల లక్ష్మణ్, అద్దా త్రిమూర్తులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

కొత్తపల్లి: క్రీడలతో మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని కో ఆప్షన్ సభ్యుడు కారే శ్రీనివాసరావు అన్నారు. మూలపేటలో వైఎస్సార్ సీపీ నాయకుడు కంబాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఎంపీఎల్ క్రికెట్ టోర్నమెంటును ఆయన ప్రారంభించారు. ఈ టోర్నీలో 15 జట్లు పాల్గొంటున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే క్రీడల్లో యువత పాల్గొనాలన్నారు. ఎంతోమంది క్రీడాకారులు తమ ప్రతిభను కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో గుర్తింపు సాధించారన్నారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, అద్దా త్రిమూర్తులు పాల్గొన్నారు.